నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
శుక్రవారం | ఏప్రిల్ 19, 2024 | www.navatelangana.com

ఎన్నికల వ్యయ పరిశీలకులను కలిసిన కలెక్టర్

నవతెలంగాణ-నస్పూర్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి ఎన్నికల వ్యయ పరిశీలకులు సమీర్ నైరంతర్యని కలెక్టర్ బదావత్ సంతోష్ కలిశారు. గురువారం రామగుండంలోని ఎన్‌టీపీసీలో గల జ్యోతి అతిథి గృహంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేసి స్వాగతం పలికారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో భాగంగా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచారంలో భాగంగా చేయనున్న ఖర్చుల వివరాలను పర్యవేక్షిస్తారని తెలిపారు.



ప్రేంసాగర్‌రావు చిత్రపటానికి జలాభిషేకం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం కనిష్ట స్థాయికి పడిపోయినా గూడెం లిఫ్టు ద్వారా సాగు నీరు అందించి నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు చిత్రపటానికి రైతులు జలాభిషేకం చేశారు. గురువారం కడెం కాలువ 30వ డిస్ట్రిబ్యూటర్ వద్ద రైతులు ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రేమ్‌సాగర్‌రావు జిందాబాద్, కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



ఓట్లు పెరిగాయ్..!

- గత లోక్‌సభ ఎన్నికల కంటే ఈ సారి అధికం
- ఐదేండ్లలో 1.56లక్షల మంది పెరిగిన ఓట్లు
- ప్రస్తుతం లోక్‌సభ పరిధిలో 16,44,715ఓటర్లు
- అప్పుడు..ఇప్పుడు అతివలయే ఎక్కువ

ఓటు వజ్రాయుధం. రాజ్యాంగం ప్రతి ఒక్కరికి ప్రసాదించిన వరంలాంటిది. ఇంతటి శక్తివంతమైన ఓటును నమోదు చేసుకోవడమే కాదు.. వినియోగించుకోవడమూ అంతే ముఖ్యం. యువతలో చైతన్యం..ప్రజల్లో అవగాహన..అధికారుల కృషి ఫలితంగా ఓట్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రతి ఏటా చేపట్టిన ఓటరు నమోదు కార్యక్రమంలో అర్హులైన కొత్త వారు నమోదు చేసుకోవడం విశేషం. దీంతో గత లోక్‌సభ ఎన్నికల కంటే ఈ ఎన్నికలు వచ్చే సరికి ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో ఏకంగా 1.56లక్షల మంది పెరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత 2019 లోక్‌సభ పరిధిలో 14,88,353 మంది ఓటర్లు ఉండగా ఈ ఐదేండ్ల వ్యవధిలో తాజా ఎన్నికలు వచ్చే సరికి ఈ సంఖ్య 16,44,715మందికి చేరుకుంది. ఐదేండ్లలో 1,56,362మంది ఓటర్లు పెరిగారు. మరోపక్క ఇటీవల కొత్తగా చాలా మంది నమోదు చేసుకోవడంతో ఈ నెల 25న ఎన్నికల సంఘం తుది జాబితా విడుదల చేయనుంది. దీంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి


ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎన్నికలు చాలా కీలకమైన అంశం. పాలకులను ఎన్నుకునే అవకాశం రాజ్యాంగం ప్రజలకే కల్పించింది. ఇందుకు ఓటు ఆయుధాన్ని ప్రజల చేతిలో పెట్టింది. 18ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండటంతో పాటు ఎన్నికల్లో తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం సూచిస్తోంది. ఇందులో భాగంగా అధికార యంత్రాంగం ప్రతి ఏటా ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపడుతోంది. పల్లెలు, పట్టణాల్లో క్రతువుపై విస్తృతంగా అవగాహన కల్పిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తోంది. బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఓటు నమోదు చేపడుతున్నారు. మరోపక్క అంతర్జాలంలోనూ ఓటు నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. వివిధ రకాల సౌకర్యాలు కల్పించడంతో యువత సైతం ఓటు నమోదు పట్ల ఆసక్తి కనబరుస్తోంది. ఇందులో భాగంగా ప్రతి ఏటా కొత్తగా ఓటు నమోదు చేయడంతో పాటు చనిపోయిన వారి పేర్లను తొలగించి ఓటరు జాబితా రూపొందించి విడుదల చేస్తోంది. తాజాగా ఈ ఏడాదిలో ఎన్నికలు ఉండటంతో అధికార యంత్రాంగం మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఓటు నమోదు ప్రక్రియ చేపట్టడంతో గణనీయమైన సంఖ్యలో పెరిగేందుకు కారణమైనట్లు తెలుస్తోంది.

అతివల ఓట్లే అధికం..!

ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. సిర్పూర్‌లో మినహా మిగితా ఆసిఫాబాద్, ఆదిలాబాద్, ఖానాపూర్, బోథ్, నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో మాత్రం పురుషుల కంటే మహిళల ఓట్లే అధికంగా ఉన్నాయి. 2019లోక్‌సభ ఎన్నికల సమయంలో మొత్తం 14,88,353 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 7,30, 233 మంది ఉండగా మహిళలు 7,58,064 మంది, ఇతరులు 56 మంది ఉన్నారు. తాజాగా 2024కు వచ్చే సరికి మొత్తం ఓటర్లు 16,44,715 మంది ఉండగా ఇందులో పురుషులు 8,02,575 మంది, మహిళలు 8,42,054 మంది, ఇతరులు 86మంది ఉన్నారు. అప్పటికీ..ఇప్పటికీ ఈ లోక్‌సభ నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళల ఓట్లే అధికంగా ఉండటం గమనార్హం.

2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
సిర్పూర్	102368	100794	03	203165
ఆసిఫాబాద్	99627	99862	19	250211
ఖానాపూర్	99986	103749	11	203746
ఆదిలాబాద్	108584	111021	07	219612
బోథ్	94737	98633	03	193373
నిర్మల్	112484	125882	05	238731
ముథోల్	112447	118123	18	230588



2024 లోక్‌సభ ఎన్నికల్లో పెరిగిన ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
సిర్పూర్	114484	114359	12	228855
ఆసిఫాబాద్	112510	114056	16	226582
ఖానాపూర్	109333	114437	13	223783
ఆదిలాబాద్	119154	124375	06	243535
బోథ్	102333	108580	02	210915
నిర్మల్	121527	135702	19	257248
ముథోల్	123234	130545	18	253797

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల నిరసన



మంచిర్యాల : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ నాయకులపై ఏబీవీపీ నాయకులు దాడి చేయడాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు ఖండించారు. దాడికి పాల్పడిన ఏబీవీపి నాయకులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేస్తూ గురువారం పట్టణంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదునూరి అభినవ్ మాట్లాడుతూ యూనివర్సిటీలో ఏబీవీపీ గూండాలు హింసాత్మక ఘటనకు తెరలేపారని, హెచ్‌సియు స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్ ఎండి.అతీక్ అహ్మద్, యూనిట్ సెక్రటరీ కృప, జార్జ్ తదితరులపై దాడి చేశారన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని, దీనికి మూడు రోజుల ముందు ఎస్ఎఫ్ఐ క్రియాశీల సభ్యుడు హర్షపై కూడా దాడి చేశారని పేర్కొన్నారు. శాంతియుతంగా ఉన్న యూనివర్సిటీ వాతావరణాన్ని ఏబీవీపీ నాయకులు ఉద్రిక్తంగా మార్చుతున్నారన్నారు. పోలీసులు సమగ్ర విచారణ జరిపి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గర్ల్స్ జిల్లా కన్వీనర్ సానియా, జిల్లా కమిటీ సభ్యులు బండి సత్యనారాయణ, నవ్య, గాయత్రి, యాసిన్, పవనశ్రీ పాల్గొన్నారు.

మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి



జైపూర్: మండలం మీదుగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవేలో నష్టపోతున్న భూములకు మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతులు గురువారం కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నర్వ రసూల్‌పల్లి, ఎల్కంటి, టేకుమట్ల, ఇందారం, షెట్‌పల్లి, కుందారం, కిష్టాపూర్, వేలాల, పౌనూర్, గోపాల్‌పూర్, బెజ్జాల గ్రామ శివారుల మీదుగా చేపడుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు అతి తక్కువ ధరతో నష్టపరిహారం ఇవ్వాలని చూడటం బాధాకరమని పేర్కొన్నారు. మండలలో ప్రస్తుతం ఎకరాకు ఎక్కడ చూసిన రూ.50లక్షల నుండి మొదలు రూ.కోటి వరకు ధర పలుకుతోందన్నారు. కిష్టాపూర్ శివారులో నిర్మించిన పార్వతి బ్యారేజ్ నిర్మాణంలో నష్టపోయిన భూములకు 2017లో ఎకరాకు రూ.8లక్షల20వేల చొప్పున నష్టపరిహారం చెల్లించారని గుర్తు చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం రైతుల న్యాయమైన అభ్యర్థన పట్ల సానుకూలంగా స్పందించాలని కోరారు. ఎన్నికల కోడ్ ఉన్నందున స్పందించడం సరికాదని, రైతులు అభ్యర్థన పట్ల అవగాహన కలిగి ఉన్నానని పేర్కొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు సీపీఆర్‌పై అవగాహన

మంచిర్యాల: పట్టణంలోని హైటెక్ సిటీ క్లబ్‌లో గురువారం విద్యుత్ శాఖలో పని చేసే ఉద్యోగులకు సీపీఆర్, ప్రథమ చికిత్సపై అవహగాహన కల్పించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వాహకులు ఉద్యోగులకు సీపీఆర్‌పై ట్రైనర్ వెంకటేష్ అవగాహన కల్పిస్తూ గుండె జబ్బులు వయస్సుతో సంబంధం లేకుండ చిన్న పిల్లల నుండి పెద్దవారికి వస్తున్నాయని, ఆపదలో ఉన్నవారికి ప్రథమ చికిత్స అందించి సమీప ఆస్పత్రికి చేర్పించే బాధ్యత ప్రతి ఒక్కరిదన్నారు. అలాగే కరంట్ షాక్, పాము కాటు, రోడ్డు ప్రమదాల్లో గాయాలైన వారికి ప్రథమ చికిత్స అందించి, బ్యాండెజ్ ద్వారా కట్లు వేసే పద్ధతిని వివరించారు. తలసేమియా పిల్లల కోసం త్వరలోనే విద్యుత్ శాఖ ఆధ్వర్యం లో బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అవగాహన సదస్సులో విద్యుత్ శాఖ మంచిర్యాల సర్కిల్ సిబ్బంది డిఈలు ఖైసర్, రాజన్న, పెద్ది రాజాం, శ్రీనివాస్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి జిల్లా ఛైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, కమిటి సభ్యులు కాసర్ల శ్రీనివాస్, చుంచు శంకర్ వర్మ పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

కాసిపేట : ఎంపీపీ రొడ్డ లక్ష్మీ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. వివిధ శాఖలకు సంబంధించి అధికారులు ప్రగతి నివేదికలను వివరించారు. పలు అంశాలపై సభ్యులు ప్రశ్నించగా అధికారులు సమాధానాలు చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీపీ రొడ్డ లక్ష్మీ మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, నూతన ప్రభుత్వం పనులు చేపట్టాలని తెలిపారు. జడ్పీటీసీ పల్లె చంద్రయ్య మాట్లాడుతూ ఇప్పటి వరకు తమ హయాంలో అనేక అభివృద్ధి పనులు చేశామని, ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకొని మండలాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. సమావేశంలో ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీటీసీలు కొండబత్తుల రాంచందర్, మేరుగు పద్మ చంద్రమౌళి, కోఆప్షన్ సిరాజ్‌ఖాన్, ఎంపీవో నాగరాజు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలల ప్రవేశానికి దరఖాస్తులు

నస్పూర్ : 2024-25 విద్యా సంవత్సరంలో అర్హత గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలలల్లో ఇంటర్మీడియట్, ఎంసెట్ ఉచిత విద్యను అందించేందుకు జిల్లాలోని అర్హత గల ప్రయివేట్ కళాశాలల నుండి ప్రతిపాదనలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల ప్రయివేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్, కరస్పాండెంట్స్ తమ కళాశాల సంబంధిత అనుమతి ధృవీకరణ పత్రం, కళాశాలలో సదుపాయాలు, బిల్డింగ్ ప్లాన్, అగ్నిమాపక భద్రత, గత 5 సంవత్సరాల ఉత్తీర్ణత శాతం వివరణలు, కళాశాలలో నిర్వహించబడుతున్న వివిధ కోర్సుల వివరాలు, అన్ని ప్రాథమిక సౌకర్యాలతో తగినంత మంచి నివాస వసతి ధృవపత్రాలు జతపరిచి ఈ నెల 27లోగా ఈ-పాస్‌లో దరఖాస్తు చేసుకొని, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు ప్రతి, ధృవపత్రాలు సమర్పించాలన్నారు. ఆసక్తి, అర్హత గల ప్రయివేట్ జూనియర్ కళాశాలలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

20న ముఖ్య కార్యకర్తల సమావేశం

లక్షెట్టిపేట :మండల, పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం ఈ నెల 20న శనివారం కరీంనగర్‌లోని ఎస్‌పిఆర్ ఫంక్షన్ హాల్ నిర్వహిస్తున్నామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, నలిమెల రాజు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అంకతి శ్రీనివాస్ తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సమావేశంలో పాల్గొంటారన్నారు. మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి



- తండ్రితో కలిసి పాతిపెట్టిన ఆశ్రమ పూజారి
- క్షుద్ర పూజల కోసం నరబలి ఇచ్చినట్లు అనుమానం
- తల్లి ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగులోకి
- ఫోరెన్సిక్ పరీక్షలకు బాలుడి ఎముకలు

నవతెలంగాణ-రెబ్బెన

బాలుడు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన నాలుగేండ్ల తర్వాత వెలుగు చూసింది. ఈ ఘటన మండలంలో కలకలం రేపింది. 2020లో జరిగిన సంఘటన తల్లి ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం పోలీసులు బాలుడిని పాతిపెట్టిన స్థలం నుండి ఎముకలు సేకరించి ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని పాసిగాం గ్రామంలో బామ్నే భీంరావు పులాజీ బాబా ఆశ్రమాన్ని నడిపిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన సులువ శ్రీనివాస్, మల్లీశ్వరి కుమారుడు రిషి(10)ని నాలుగు సంవత్సరాల క్రితం ఆరోగ్యం బాగాలేదని ఆశ్రమానికి తీసుకెళ్లారు. అప్పటికే బాలుని తల్లిదండ్రులకు గొడవలు రావడంతో వేరయ్యారు. ఆశ్రమంలో వైద్యం వికటించి బాలుడు మరణించడంతో తండ్రి శ్రీనివాస్‌తో కలిసి భీంరావు ఆశ్రమం పక్కనే పాతిపెట్టారు. నాలుగేండ్ల తర్వాత తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. గురువారం బాలుడిని పాతిపెట్టిన ప్రదేశం నుండి ఎముకలు స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు.

క్షుద్ర పూజలకే అంటూ ఆరోపణ

నాలుగు సంవత్సరాల క్రితం బాలుడు మృతి చెందడం, ఆశ్రమంలో పాతి పెట్టడం అంత క్షుద్ర పూజల కోసమేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. బాలుడిని వేరేచోట క్షుద్ర పూజల కోసం బలిచ్చి ఆశ్రమం పక్కన పాతిపెట్టారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల విచారణలో నిజాలు తెలిసే అవకాశముంది.

తల్లి ఫిర్యాదుతో వెలుగులోకి

నాలుగు సంవత్సరాల క్రితం తన కుమారున్ని చికిత్స నిమిత్తం ఆశ్రమంలో అప్పగించి తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో తల్లి వేరే చోటికి మారింది. అప్పటి నుండి ప్రతిసారి ఆశ్రమ పూజారిని కొడుకు గురించి వాకబు చేయగా బాగున్నాడని, బాగా చదువుతున్నాడని చెబుతూ వచ్చాడు. తల్లికి అనుమానం వచ్చి గత నెల 7న రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయినప్పటికీ పోలీసులు పట్టించుకోకపోవడంతో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ద్వారా పోలీసు ఉన్నతాధికారులకు ఫోన్ చేయించింది. దీంతో పోలీసుల్లో కదలిక వచ్చి విచారణ చేపట్టారు. కొడుకు జీవించి లేడని తెలియడం, పాతిపెట్టిన చోట బొక్కలు మాత్రమే ఉండడంతో ఆ తల్లి రోదనలు మిన్నంటాయి. గత నెల 7న ఫిర్యాదు ఇచ్చినప్పటికీ పోలీసులు స్పందించకపోవడంపై కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేఏమైనా బాలుడి మృతి నాలుగు సంవత్సరాల తర్వాత బయటకు రావడం మండలంలో కలకలం రేపింది.



బయటపడ్డ ఎముకలు



తొలి రోజు రెండు నామినేషన్లు దాఖలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. తాజాగా గురువారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఆధార్ పార్టీ అభ్యర్థిగా మాలోత్ శ్యామ్‌లాల్ నాయక్, స్వతంత్ర అభ్యర్థిగా రాథోడ్ సుభాష్ నామినేషన్ పత్రాలను జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షిషాకు అందించారు.



ఐటీ శాఖ మంత్రిని కలిసిన ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నీలబోయిన కుమార్ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. సింగరేణి కార్మికులందరికీ రూ.25లక్షల వడ్డీ లేని రుణాన్ని ఇప్పించాలని, కార్మికులకు ఐటి నుంచి మినహాయింపు ఇవ్వాలని, సింగరేణిలో డిపెండెంట్ అభ్యర్థులకు వయోపరిమితి 35 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలకు పెంచాలని, సింగరేణిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌పై ఖాళీలను పూర్తి చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోశాధికారి చెరుపల్లి సురేష్, ఎస్టీ ప్రెసిడెంట్ ఇస్లావత్ దిలీప్ పాల్గొన్నారు.

సహాయక పోలింగ్ కేంద్రాల్లో సకల సౌకర్యాలు



- ఆసిఫాబాద్ జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన సహాయక పోలింగ్ కేంద్రాలలో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల పరిధిలోని తహసీల్దార్లు, ఎన్నికల అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా జిల్లాలోని శాసనసభ నియోజకవర్గ పరిధిలో మే 13న జరగనున్న పోలింగ్‌కు కేంద్రాలలో పూర్తిస్థాయి ఏర్పాట్లు కల్పించాలని తెలిపారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, మూత్రశాలలు, నీడ తదితర సౌకర్యాల కల్పనతో పాటు వయోవృద్ధులు, దివ్యాంగులు, గర్భిణుల కొరకు ర్యాంపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓటరు జాబితాపై పోలింగ్ కేంద్రం వివరాలు, చిరునామా సరి చూసుకోవాలని, ఏవైన తప్పులు ఉన్నట్లయితే వెంటనే సరి చేయాలని తెలిపారు. వేసవి దృష్ట్యా ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని, పోలింగ్ విధులలో ఉన్న సిబ్బందికి అన్ని మౌలిక వసతులు కల్పించాలని, మహిళా సిబ్బంది, దివ్యాంగ ఓటర్ల కొరకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తహసీల్దార్లు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పూర్తి వివరాలతో నివేదిక అందజేయాలన్నారు. సెక్టార్ అధికారులు, బూత్ స్థాయి అధికారులు, సూపర్ వైజర్లతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్‌రావు, కాగజ్‌నగర్ ఆర్‌డీఓ కె.సురేష్, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | ఏప్రిల్ 19, 2024 | www.navatelangana.com

ఏకలవ్య గురుకుల పాఠశాల సందర్శన

నవతెలంగాణ-నార్నూర్



మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలను గురువారం ఎంఈఓ ఆశన్న సందర్శించారు. పాఠశాలలో విద్యార్థిని పీఈటీ చితకబాదిన సంఘటనను పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పూర్తి వివరాలు సేకరించి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. వారి వెంట పాఠశాల సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-బేల

మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంజయ్ గుండావార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ వామన్ వాంఖడే ఆధ్వర్యంలో గురువారం మండలంలోని భాది గ్రామానికి చెందిన యువనాయకులు బోండ్ల వెంకట్‌రెడ్డి, ఆకుల శ్రీనివాస్ కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి పార్టీలో చేరుతున్నట్టు తెలిపారు. అధికారంలో వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాల అమలు, నిరుద్యోగ యువతకు, ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభించారని అన్నారు. మంత్రి సీతక్క, ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి సహకారంతో రాబోయే రోజుల్లో బేల మండలంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు మడావి చంద్రకాంత్, కాంగ్రెస్ యువ నాయకులు సుంకరి శ్రీనివాస్, దంతేల రాజేష్, మోర్లే దత్తు, షేక్ వజీర్, రుమాల కృష్ణ, మహాదేవ్ పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్

నవతెలంగాణ-నిర్మల్

పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు విడుదల చేయాలని, కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. గురువారం నిర్మల్ రూరల్ మండలం గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గత 4 నుంచి 7 నెలల నుంచి గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. చాలిచాలని వేతనంతో కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేసి, కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. కనీస వేతనాల జీఓను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మున్సిపాలిటీ కార్మికులకు 30 శాతం వేతనం పెంచడం జరిగిందని, అదేవిధంగా, గ్రామ పంచాయతీ కార్మికులకు వెంటనే 30 శాతం వేతనం పెంచాలని కోరారు. జనాభా లెక్కల ప్రకారం ప్రతి 500 మంది జనాభాకు ఒక కార్మికుడు చొప్పున ఖరారు చేశారన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులు 2021లో ఉన్న జనాభాకు సేవలందిస్తున్నారని అన్నారు. పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. గ్రామపంచాయతీలో నర్సరీ కార్మికులు, ట్రాక్టర్ డ్రైవర్లు, వాటర్ సప్లై కార్మికులు, వీధి దీపాల నిర్వహణ కార్మికులు, ఆఫీసు నిర్వహణ సిబ్బంది, కారోబారి, బిల్ కలెక్టర్లను కేటగిరీల వారీగా వేతనాలు పెంచాలని అన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులలో ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలన్నారు. కారోబారి, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలన్నారు. వారికి పంచాయతీ అసిస్టెంట్‌గా నామకరణం చేయాలని కోరారు. 2011 జనాభా ప్రాతిపదికన కాకుండా 2021 జనాభా ప్రాతిపదికన కార్మికుల్ని పరిగణించాలన్నారు. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పాత కేటగిరీలలోనే కొనసాగించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వం రూ.2లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. విధి నిర్వహణ, ప్రమాదాల్లో మరణించిన సిబ్బంది కుటుంబానికి రూ.10లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వమే ఇవ్వాలని అన్నారు. వయస్సు మీరిందనే సాకుతో కార్మికులను మార్చితే, ఆ కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. వయస్సు మీరిన కార్మికులకు వారసులు లేకుంటే, వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు ఇవ్వాలని అన్నారు. కారోన సోకి మరణించిన కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుని దహన సంస్కారాలకు రూ.30వేలు ఇవ్వాలన్నారు. సంవత్సరానికి 3జతల యూనిఫాంలు, సరిపడా చెప్పులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలని అన్నారు. 8గంటల పని దినాన్ని అమలు చేయాలని, ఆదివారం, పండుగ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిర్మల్ రూరల్ గ్రామపంచాయతీ యూనియన్ అధ్యక్షులు ముత్యం, కార్యదర్శి ప్రవీణ్, నాయకులు నవీన్, నరేష్, సతీష్, సాయవ్వ రాజన్న పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి



నవతెలంగాణ-నార్నూర్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. బీఆర్ఎస్ ఆయాంలోనే అనేక సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి సాధ్యమైందని అన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు షేక్ దస్తగిర్, మండల మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఉర్వేత రూపదేవ్, పార్టీ జనరల్ సెక్రటరీ సయ్యద్ కాశీం, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు రూపదేవ్, మడావి కైలేశ్వరీ సాగర్, నాయకులు ఫిరోజ్ ఖాన్, రాథోడ్ సుభాష్, రాథోడ్ శివాజీ, అడ శ్రీరాం, మెస్రం మానిక్‌రావ్, మెస్రం జంగు, షేక్ బషీర్, షేక్ మసుద్, జాదే దయానంద్ ఉన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలి



నవతెలంగాణ-నిర్మల్

పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు నందిరామయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఇతర వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద ప్రజా వ్యతిరేక, రైతు కార్మిక, విధానాలకు నిరసనగా భారత రాజ్యాంగాన్ని కాపాడుకొనుటకు సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. దేశంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ బీజేపీ ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా అన్ని రంగాలని నాశనం చేసిందని అన్నారు. మతోన్మాద విధానాల్ని ముందుకు తెస్తూ, మత విభజన రాజకీయాలని చేస్తుందని అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలని ప్రజాస్వామ్య విలువలను నాశనం చేస్తూ పరిపాలన కొనసాగించిందని విమర్శించారు. బడా పెట్టుబడిదారులు ఆదాని, అంబానీలకు దేశంలో ఉన్న 25 మంది బడ కార్పొరేటు శక్తులకు వ్యాపారులకు దేశ సంపదను కట్టబెట్టిందని విమర్శించారు. అన్ని రంగాలను ప్రయివేటు పరం చేసిందని, ఉద్యోగ భద్రత లేకుండా నిరుద్యోగాన్ని పెంచి పోషించిందని అన్నారు. 80 శాతం నిరుద్యోగ యువత ఇవాళ దేశంలో ఉద్యోగాలు లేక వారి భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరొకసారి అధికారంలోకి రావడానికి మోడీ ప్రభుత్వం అనేక రకాలుగా ఎత్తుగడలతో ముందుకు వస్తుందని, అనేక రకాల తప్పుడు హామీలను ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఇస్తుందని, మత రాజ్యాంగాన్ని మనువాద రాజ్యాంగాన్ని, తీసుకురావడం కోసం అనేక రకాల ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. మధ్య యుగాల నాటి వ్యవస్థ, బానిస వ్యవస్థను తీసుకురావడం కోసం రాజ్యాంగాన్ని మారుస్తామని దుర్మార్గమైనటువంటి పద్ధతులకు పాల్పడుతుందని విమర్శించారు. దేశంలో కార్మికులు, రైతులు, కూలీలు, యువత ఏ రంగంలో చూసిన అన్ని రంగాలను పట్టించుకోకుండా నిర్వీర్యం చేసే దిశగా 10 సంవత్సరాల పరిపాలన కొనసాగిందని అన్నారు. మరొకసారి ఓట్లు దండుకోవడానికి ఎన్నికల ఎజెండాలో భాగంగానే అయోధ్య విషయాన్ని రాముడు విషయాన్ని ముందుకు తెచ్చిందని అన్నారు. గత ఎన్నికలకు ముందు పుల్వామా దాడులను వాడుకొని సైనికులను బలి చేసిందని, ఇవాళ మరొకసారి మోసం చేయడానికి రాముడు పేరును ముందుకు తెచ్చి, ఈ దేశానికి రాముడే శ్రీరామరక్ష ఇవాళ ప్రజల బలహీనతలను మూఢనమ్మకాలను ఆసరాగా చేసుకుని పరిపాలన చేయడానికి ముందుకు వస్తున్న బీజేపీని దానికి అనుకూలంగా ఉన్న శక్తులను వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఓటు రూపంలో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వాము పక్ష నాయకులు దుర్గం నూతన్ కుమార్, రాజన్న, ఏం హరిత, ఠాకూర్, తిరుపతి, జె.రాజు, ఆర్.రామ లక్ష్మణ్, ఎం.బక్కన్న, లక్ష్మి సునారికారి రాజేష్, ఎండీ గఫూర్, వెంకటేష్, శంభు, భోజన్న, ఆకుల సత్తన్న, డి.పోశెట్టి, వర్మ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకులపైన జరిగిన దాడిని ఖండిస్తున్నాం

నవతెలంగాణ-నిర్మల్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో ఎస్ఎఫ్ఐ నాయకులపైన జరిగిన దాడిని ఖండిస్తూ గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తూ నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నామత్కర్ నవీన్ మాట్లాడారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 17న అర్ధరాత్రి ఎస్ఎఫ్ఐ నాయకులపైన జరిగిన ఏబీవీపీ మతోన్మాద గుండాలు చేసిన దాడిని ఖండిస్తున్నామన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ కూటమి విద్యార్థి సంఘం ఎన్నికల్లో విజయం సాధించిందని అన్నారు. అది తట్టుకోలేక ఏబీవీపీ మతోన్మాద గుండాలు ప్రతిరోజు ఏదో ఒక దాడికి ఎస్ఎఫ్ఐ నాయకులపైన పాల్పడుతున్నారన్నారని విమర్శించారు. ఎదురుగా నిలబడే దమ్ము లేక అక్రమంగా విద్యార్థి సంఘ నాయకులపైన దాడులు చేస్తూ యూనివర్సిటీలో ఒక గుండా రాజకీయాలను చేస్తున్నారన్నారని అన్నారు. ఈ దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నిర్మల్ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుందని అన్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థుల, విద్యార్థి నాయకుల పైన దాడి చేయడం సిగ్గుచేటు అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే దమ్ములేని మతోన్మాద సంఘం విద్యార్థులపైన దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దమ్ముంటే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. మీబలం ఏంటిదో మొన్న జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో తెలిసిందన్నారు. ఈ దాడికి పాల్పడిన వారి పైన రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ అధికారులు చట్టబరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సాయి, సత్యం, రాజు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎండాకాలం జాగ్రతలు పాటించాలి



నవతెలంగాణ-నార్నూర్

ఎండాకాలం నేపథ్యంలో గర్భిణీలు తగిన జాగ్రతలు పాటించాలని హెల్త్ సూపర్‌వైజర్‌లు చరణ్‌దాస్, రాజమ్మలు సూచించారు. గురువారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రంలో న్యూట్రిషన్ డే సందర్భంగా అవగాహన కల్పించారు. గర్భిణీలకు చిన్నారులకు టీకాలు వేయించారు. ఎండాకాలం నేపథ్యంలో తాగునీరు ఎక్కువగా తీసుకోవాలని, వీటితో పాటు పండ్లు కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది హిమబిందు, సుశీల, చౌహాన్ సింధు, ఆశాలు అనిత, సంగీత ఉన్నారు.

కూలీల సంఖ్య పెంచకపోతే వేతనాల్లో కోత

- డీఆర్డీఓ సాయన్న



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీఓ సాయన్న

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచక పోతే ఫీల్డ్ అసిస్టెంట్‌ల వేతనాల్లో కోతలు విధిస్తామని డీఆర్డీఓ సాయన్న అన్నారు. గురువారం ఆయన మండలంలోని గౌరాపూర్ గ్రామంలో కూలీలు చేస్తున్న రాళ్లకట్టల పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రతి రోజూ కూలీలు పనిచేసే చోటనే మాస్టర్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో గ్రీన్‌నేట్‌తో పాటు తాగు నీటిని అందుబాటులో ఉంచాలని టీఏ గణేష్‌కు ఆదేశించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, టీఏ, ఎఫ్ఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి జీపీల వారిగా జాబ్ కార్డుల సంఖ్య, ప్రస్తుతం పనిచేస్తున్న కూలీల సంఖ్యపై ఆరా తీశారు. పిట్ట బొంగరం, వడగావ్, ధనోర, తదితర జీపీల్లో పనిచేసే కూలీల సంఖ్య తక్కువగా ఉండటంతో టీఏ వేతనాల్లో కోత విధిస్తామని హెచ్చరించారు. వచ్చే వారం రోజుల్లోపు ప్రతి హాబిటేషన్, జీపీల నుంచి కనీసం ఐదు వందల మంది కూలీలకు పనులు కల్పించాలని పేర్కొన్నారు. కొందరు ఎఫ్ఏలు పెండ్లిల సీజన్ ఉండటం వల్ల పనులకు రావడం లేదని, పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. అదేవిధంగా తాగు నీటి ఎద్దడి ఉన్న మామిడి గూడ, దోడంద తదితర గ్రామాలకు తాగునీరు అందించాలని పీఎస్‌లకు సూచించారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సప్లై చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ. కే.భాస్కర్, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ భాను కుమార్, ఈజీఎస్ ఏపీఓ జాధవ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ దినాన్ని విజయవంతం చేయాలి

- రగల్ జెండా నాయకులు డిమాండ్




నవతెలంగాణ-ఇంద్రవెల్లి

జల్, జంగల్, జమీన్ అనే నినాదంతో అమరులైన ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని రంగల్ జెండా ఆశయ సాధన కమిటీ నాయకులు తులసి రామ్, మెస్రం నాగనాథ్‌లు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అమరవీరుల స్థూపం వద్ద విలేకరులతో మాట్లాడుతూ శనివారం జరిగే సంస్మరణ దినానికి జిల్లాలోని వివిధ గ్రామాల పటేళ్లు, సార్మెడీలు, పూజారులు తప్పక హాజరు కావాలని కోరారు. ఆదివాసుల హక్కుల కోసం అమరులైన వారికి స్వేచ్ఛ వాతావరణంలో ఘనంగా నివాళు లర్పిద్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఇంద్రు పటేల్, కినక జుగాది, ముఖాడే ఉత్తమ్ పాల్గొన్నారు.

బెల్ట్ షాపులను మూసివేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో బెల్ట్ షాపులను యుద్ధ ప్రాతిపదికన మూసివేయాలని పీఓడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి మడవి రేణుక డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కుమురం భీమ్ భవన్‌లో పీఓడబ్ల్యూ జిల్లా కమిటీ సమావేశం వనిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మడవి రేణుక మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే బెల్ట్ షాపులను మూసివేస్తామని ప్రజలకు హామీ ఇచ్చి ఎన్నికల్లో గెలిచారు. కానీ ఈరోజు వరకు బెల్ట్ షాపులను రద్దు చేయకుండ నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లాగానే ఈ ప్రభుత్వంలోనూ బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయన్నారు. మంచినీళ్లు దొరకటం లేదు గాని ప్రతి గ్రామంలో సారా, బెల్ట్ షాపుల్లో మద్యం ఏరులై పారుతుందన్నారు. ఈ మద్యం షాపుల వల్ల సంసారాలు ఆగమై కుటుంబాలు అప్పులపాలై, సామాన్యులు బతికే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. మద్యం షాపుల వల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని మాత్రమే చూస్తున్నారు. కాని ప్రజల జీవన స్థితిగతులను, వారి ఆరోగ్య విషయాలను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే తెలంగాణ మొత్తం తాగుబోతుల తెలంగాణగా మారి జీవితాలు ఆగమయ్యే పరిస్థితులు ఉత్పన్నమవుతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే యుద్ధ ప్రాతిపదికన జిల్లాలో సారాను నిషేధించి, బెల్ట్ షాపులను మూసివేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల జిల్లా వ్యాప్తంగా ప్రగతిశీల మహిళా సంఘం తరఫున బెల్ట్ షాపులను ఎత్తేసే వరకు ఉద్యమాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో వనిత, రుక్మాబాయి, అంజు, లక్ష్మీబాయి, జంగుభాయి, యశోద, జమున పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ నాయకురాలు మదావి రేణుక

భక్తులకు పండ్లు, నీళ్లు అందజేత

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రం నుంచి కొండగట్టుకు కాలినడకన వెళ్లే అంజనేయ స్వాములకు పండ్లు, నీళ్ల బాటిళ్లను గురువారం యువ నాయకులు అజ్మీరా జయచంద్ర అందజేశారు. నిస్వార్థ సేవకులకు ఆంజనేయుడు ఇంకా శక్తి నివ్వాలని, సుఖంగా వెళ్లి లాభంగా ఇంటికి చేరుకోవాలని సూచించారు. శాలివాహన కుమ్మరి సంఘం కార్యదర్శి, నైట్ యూత్ నాయకులు పాల్గొన్నారు.

మంచిర్యాల ఘటనకు ఆదిలాబాద్‌తో సంబంధం లేదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మంచిర్యాల జిల్లాలో ఓ ప్రయివేట్ పాఠశాలలో జరిగిన ఘటనలో నిందితులపై కేసును నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతున్నదని, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనతో ఆదిలాబాద్ జిల్లాకు ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా పోలీసులు పూర్తి అప్రమత్తతతో ఎటువంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా నిఘా వ్యవస్థను కట్టిదిట్టం చేసుకొని, విధులను నిర్వర్తిస్తున్నట్టు పేర్కొన్నారు. తప్పు చేసేవారు కోర్టుల నుంచి శిక్షల నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు.

గంజాయి నిర్మూలనే లక్ష్యం : డీఎస్పీ నాగేందర్

నవతెలంగాణ-నార్నూర్

గంజాయి నిర్మూలనే లక్ష్యమని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అన్నారు. గురువారం గాదిగూడ మండలంలోని ధాబా(కె) గ్రామంలో సీఐ రహీం పాషా ఆధ్వర్యంలో గాదిగూడ, నార్నూర్ పోలీసు సిబ్బంది బృందంగా ఏర్పడి జిల్లా సీసీఎస్ పోలీసు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. తనిఖీ చేయగా ఒక వ్యక్తి వద్ద నుంచి రూ.12 వేల 5వందల విలువ చేసే ఐదు వందల గ్రాముల గంజాయిని పోలీసు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గాదిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేసి, అట్టి గంజాయిని పండించి రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. ప్రభుత్వం గంజాయి వినియోగం, అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల విషయంలో ప్రత్యేక ప్రణాళికలు రచించి, రాష్ట్రంలో గంజాయి నిర్మూలన లక్ష్యంగా పని చేస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ గంజాయి, మాదకద్రవ్యాలకు వినియోగంకు దూరంగా ఉండాలని సూచించారు. వారి వెంట నార్నూర్, గాదిగూడ ఎస్సైలు జి.మహేష్, సీహెచ్ రవి కిరణ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఐటీఐ ఉత్తీర్ణత పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఉట్నూర్

2024 సంవత్సరానికి గాను ఐటీఐలో వివిధ ట్రెడుల్లో అనుభవం ఉన్న అభ్యర్థులు ప్రయివేటుగా ఉత్తీర్ణత పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఉట్నూర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి శిక్షణ శాఖ అవకాశం కల్పించడం జరిగిందని, దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు మొదటి, రెండో సంవత్సరం కోర్సులో ట్రెడుకు సంబంధించి ప్రయివేట్, ప్రభుత్వ సంస్థలలో మూడు సంవత్సరాలు పని చేసి అనుభవం కలిగి ఉండి, ట్రేడులో పరీక్ష రాసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 19లోపు వరంగల్‌లోని రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ 9490202037 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | ఏప్రిల్ 19, 2024 | www.navatelangana.com

మితిమీరిన స్పీడ్ బ్రేకర్ల నిర్మాణాలు ఆపాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



పట్టణంలోని లారీ చౌరస్తా నుండి ఎస్పీఎం వర్కర్స్ గేటు వరకు చేపడుతున్న మితిమీరిన స్పీడ్ బ్రేకర్ల నిర్మాణాలను ఆపాలని సీపీఐ(ఎం) నియోజవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. 500 మీటర్లు కూడా లేని రోడ్డుకు ఇప్పటికే 10 స్పీడ్ బ్రేకర్లు పెట్టారని, మళ్ళీ కొత్తగా స్పీడ్ బ్రేకర్లు వేస్తున్నారన్నారు. ఈ స్పీడ్ బ్రేకర్ల వల్ల బైక్ పైన ప్రయాణం చేసే వారికి వెన్నుపూస సమస్యలు వస్తాయని, అవసరం ఉన్న చోట స్పీడ్ బ్రేకర్లు నిర్మించకుండా ఉన్న చోటే మళ్ళీ నిర్మాణం చేపడుతున్నారని అన్నారు. వెంటనే ఈ స్పీడ్ బ్రేకర్ల నిర్మాణం ఆపాలని కోరారు. లేని పక్షంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాటం చేపడుతామని స్పష్టం చేశారు.

బీజేపీలో చేరిన బీఎస్పీ నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



బీఎస్పీ నాయకులు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు.బాబాసాగర్ గ్రామానికి చెందిన జిల్లా ఆర్గనైజర్ దుర్గం జనార్ధన్, అంబేద్కర్ కమిటీ సభ్యులు దుర్గం బాబురావు, ఉపాధ్యక్షులు శివరాం, కార్యదర్శి రాజాలింగు, నాగేష్, రమేష్ బీఎస్పీ నుండి గురువారం బీజేపీలో చేరాగా ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతం కోసం నూతనంగా చేరిన వారు కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పింస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్పుతే తుకారాం, పవన్ పురోహిత్, నగపురే మోహన్, కత్తెర్ల భీమేష్ పాల్గొన్నారు.

ఆగని బెల్టు దందా

- పల్లెల్లో విచ్చలవిడిగా సాగుతున్న మద్యం అమ్మకాలు
- నామమాత్రపు దాడులతో సరిపెడుతున్న అధికారులు
- ఫిర్యాదు వస్తేనే స్పందిస్తామనే ధోరణిలో ఎక్సైజ్ శాఖ



వైన్స్ నుంచి మద్యం తీసుకెళ్తున్న బెల్టుషాపు నిర్వాహకులు

నవ తెలంగాణ-చింతలమానేపల్లి

గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపుల దందా జోరుగా సాగుతోంది. ఓవైపు ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఈ క్రమంలో బెల్టు షాపులు, అక్రమ మద్యం విక్రయాలను ఎక్సైజ్, పోలీసు శాఖ అరికట్టాలి. కానీ వారు మాత్రం నిద్రవస్థలో ఉన్నట్టు కనిపిస్తుంది., తమకు ఫిర్యాదు వస్తేనే స్పందిస్తామనే దోరణిలో ఉన్నారు. అధికారులు వ్యవహర శైలిపై పలు అనుమాలు వ్యక్తం అవుతున్నారు. బెల్టు షాపులు యధేచ్ఛగా కొనసాగుతున్నయంటే అధికారులు సహకారం వారికి ఉన్నట్టు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో కిరాణా దుకాణాలు, చిన్నపాటి డబ్బాలను అడ్డాగా ఏర్పాటు చేసుకుని, మూడు ఫుల్ బాటిళ్లు, ఆరు బీర్లు అన్న చందంగా బెల్టు దందా సాగిస్తున్నారు. కొందరు ఎన్నికల కోడ్ సాకుతో మరింత ఎక్కువ ధరలకు మద్యం విక్రయిస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు మాత్రం నామమాత్రపు దాడులతో సరిపెడుతున్నారు.



యధేచ్ఛగా బెల్టు షాపులు

వైన్స్ దుకాణాల్లో ఎంత అడిగితే అంత మద్యం బెల్టుషాపుల వారికి విక్రయిస్తున్నారు. దీంతో పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. మండలంలో 19 గ్రామపంచాయతీ ఉండగా రవీంద్ర నగర్-1 వైన్ షాపు నుండి 14 గ్రామ పంచాయతీ, మండల కేంద్రంతో పాటు కర్జెల్లి, బాబాసాగర్, బాలాజీ అనుకోడ, రవీంద్ర నగర్-1, రవీంద్ర నగర్-2, బాబాపూర్, లంబాడి హేటి, రన్వెల్లి, బూరేపల్లి, కోర్సిని, గంగాపూర్ ఆయా గ్రామాల్లోని బెల్టుషాపులకు ఇక్కడి నుండే మద్యం సరఫరా అవుతుంది. ఒక్కొక్క గ్రామపంచాయతీలలో 10 బెల్ట్ షాపులు తక్కువ కాకుండా నడుస్తున్నాయి. మద్యం దుకాణం నుంచి ఉదయమే ఎలాంటి భయం లేకుండా మందును తీసుకెళ్తున్నారు. వారికి కూడా తెలుసుకు అధికారుల అండ తమపై ఉందనే నమ్మకం, ధైర్యంతో తీసుకెళ్తున్నారు.

కోడ్ ఉన్న పట్టింపేదే..?

ప్రతి గ్రామంలో 10కి తక్కువ కాకుండా బెల్టు షాపులున్నాయి. ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోబలకు గురి చేయకుండా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని అధికారులు ఇప్పటికే ఆయా మీటింగుల్లో ఎక్సైజ్, పోలీసులకు సూచించారు. నిత్యం గ్రామాల్లో పర్యటిస్తు బెల్టు షాపులు కొనసాగకుండా చూడాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలు సాగిస్తు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. వైన్ షాపుల నుంచి ప్రధాన రహదారుల మీదుగా మద్యాన్ని తరలిస్తున్నారు.

అధికారులకు మాముళ్లు..?

బెల్టు షాపులకు ప్రధాన రహదారి గుండానే ఉదయం వేళ మద్యం తీసుకెళ్తున్నారు. అధికారులు తమకు ఏమి చేయరనే నమ్మకంతో నిర్వహకులున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారు సిండికేట్‌గా మరి అధికారులకు ముడుపులిస్తున్నారనే ఆరోపణలున్నారు. మూడుపులు తీసుకుంటు ఈ అక్రమ దందాకు అధికారులు సహకారం అందిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. ఇదిలా ఉంటే తమపై ఎలాంటి ఆరోపణలు రావద్దని అదపదడప దాడులు నిర్వహిస్తు కేసులు నమోదు చేస్తున్నారు. అయిన బెల్టు షాపుల దందా మాత్రం అగడం లేదు.

గుట్టుగా అమ్మకాలు..

ప్రధాన రహదారులపై ఉన్న గ్రామాలు చింతలమానెపల్లి, కర్జెల్లి, రవీంద్ర నగర్-1 తదితర గ్రామాల్లో మద్యం విక్రయాలు గుట్టుగా సాగుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే.. స్థానిక పోలీసులు పలు గ్రామాల్లో దాడులు నిర్వహించి, బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో బెల్టుషాపుల నిర్వాహకులు మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. దొంగచాటున విక్రయించే మద్యానికి ఇష్టారీతిగా ధరలు నిర్ణయిస్తున్నారు. ఒక్కో క్వార్టర్‌కు రూ.40 నుంచి రూ.60 వరకు ఎక్కువగా అమ్ముతున్నట్లు తెలుస్తోంది.

పరిమితికి మించి విక్రయాలు..

వైన్ షాపుల నిర్వాహకులు కూడా నిబంధనలను అతిక్రమిస్తున్నారు. పరిమితికిమించి మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఒక్కో వ్యక్తికి 6 ఫుల్ బాటిళ్లు, ఒక కాటన్ బీర్ వరకు విక్రయించే పరిమితి ఉంది. కానీ వైన్ షాపుల నిర్వాహకులు ఈ నిబంధనలకు నీళ్ల వదులుతున్నారు. బెల్టుషాపుల నిర్వాహకులకు మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఒక్కో వ్యక్తి కాటన్ల కొద్దీ మద్యాన్ని వైన్ షాపుల నుంచి తీసుకెళ్తున్నారు. ఈక్రమంలో నిబంధనలు అతిక్రమించి, అధికంగా మద్యం అమ్ము తున్న వైన్ షాపుల పై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

అధికారి ఏమన్నరంటే..

ఇదే విషయమైన కాగజ్‌నగర్ అబ్కారీ శాఖ సీఐ శ్యామూల్ జాన్‌ని వివరణ కోరగా.. ఇప్పటి వరకు మాకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు. ఫిర్యాదు వస్తే తప్ప చర్యలు తీసుకోబోమన్నంటు బాద్యత రహిత్యంగా సమాదానం చెప్పారు. ఎక్సైజ్ అధికారుల విధుల్లో బెల్టు షాపుల నివారణ ఉంది. అయితే ఈ అధికారి మాత్రం ఫిర్యాదు వస్తేనే పని చేస్తామని చెప్పడం గమనార్హం.

ప్రజల సౌకర్యార్థం తాగునీటి ఏర్పాటు

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వేసవి దృష్ట్యా వివిధ పనుల నిమిత్తం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయానికి వచ్చే ప్రజలు, కార్యాలయంలోని అధికారులు, సిబ్బందికి తాగునీటి ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన తాగునీటి ప్లాంట్‌ను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా ప్రజల సౌకర్యార్థం ఈ తాగునీటి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. చల్లని నీరు ఎల్లప్పుడు కలెక్టరేట్‌లో అందుబాటులో ఉండడానికి ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈనెల 25 వరకు నామినేషన్ల ప్రక్రియ

పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా గురువారం ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ ఈనెల 25 వరకు కొనసాగుతుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించడానికి చర్యలు తీసుకున్నట్లు జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేశామన్నారు. నామినేషన్ల స్వీకరణ, విత్ డ్రా, తిరస్కరణ అంత కూడా ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదిలాబాద్ కలెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. మే 13న పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి సౌకర్యాలు ఏర్పాట్లు చేశామని తెలిపారు.

బీమా ఖాతాదారులకు ధీమా

- మేనేజర్ నరసింహాస్వామి



నవతెలంగాణ-కౌటాల

బీమా ఖాతాదారులకు ధీమా అని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరసింహాస్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాదారులకు బీమాపై అవగాహన కల్పించారు. మండలంలోని గురుడుపేట గ్రామానికి చెందిన ఆలం మీరాబాయి ఇటీవల చనిపోవడంతో బీమా చేసుకొని ఉండగా ఎస్‌బీఐ లైఫ్ సంస్థ ద్వారా వచ్చిన రూ.రెండు లక్షల బీమా చెక్కును మృతురాలి కుమారుడు సురేష్‌కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాతాదారులందరు బీమా చేసుకోవాలని, అనుకోకుండా ఏదైనా సంఘటన జరిగి మరణిస్తే బీమా సౌకర్యం ఉండి ఆ కుటుంబం రోడ్డుపై పడకుండా ఉంటుందన్నారు. బీమా పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయివేటు వ్యక్తుల దగ్గర అధిక వడ్డీల ఆశకు డబ్బులు ఇచ్చి అసలు, వడ్డీ అన్నీ రాకుండా మోసపోతారని ఖాతాదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో క్షేత్రాధికారి మనోహర్, అకౌంటెంట్ రాజేష్, క్యాషియర్లు భాస్కర్, జ్యోతి, బ్యాంకు మిత్ర నీరజ, సీఎస్‌సీ మొరేశ్, ఖాతాదారులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారస్తుల ఇండ్లలో తనిఖీలు

నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలోని మర్తిడి గ్రామానికి చెందిన చిలువేరు శ్రీనివాస్ ఇంటి వద్ద గురువారం సీఐ సాదిక్‌పాషా, ఎస్ఐ విక్రమ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఫర్టిలైజర్ దుకాణం, కిరాణ దుకాణం ఇంటి వద్ద ఏకకాలంలో మూడు బృందాలుగా ఏర్పడిన పోలీసులు ఇంటిలో సోదాలు నిర్వహించారు. అధిక వడ్డీతో వడ్డీ వ్యాపారం చేస్తున్నారనే వచ్చిన ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు చేపట్టినట్టు సీఐ సాదిక్‌పాషా తెలిపారు. తనిఖీలో ఎలాంటి వివరాలు లభించలేదని పేర్కొన్నారు. కాగా చిలువేరి శ్రీనివాస్ కిరాణ దుకాణంలో 13 లీటర్ల లిక్కర్ బాటిళ్ల లభించాయని, ఆయనపై కేసు నమోదుచేసినట్టు ఆయన తెలిపారు. అధిక వడ్డీతో వడ్డీ వ్యాపారం చేస్తే సహించేదిలేదన్నారు.

21న ఉచిత మానసిక వైద్య శిబిరం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మైండ్ మ్యాటర్స్ మంచిర్యాల న్యూరో సైకియాట్రి ఆధ్వర్యంలో పట్టణంలోని ద్వారకానగర్ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఈ నెల 21న ఉచిత మానసిక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రవివర్మ, డాక్టర్ సాయిలక్ష్మిలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆల్కహాల్, ఇతర మత్తు పదార్థాల వ్యసనం మాన్పించడం, డిప్రెషన్, ఆత్మహత్య ప్రయత్నలు చేసుకోకుండా సూచనలు, ఆందోళన, గుండెల్లో దడ, గుబులు, వివిధ రకాలైన తలనొప్పులు, తనలో తాను నువ్వుకోవటం, మాట్లాడుకోవటం, చిన్న పిల్లలు అతిగా అల్లరి చెయ్యటం, సరిగా చదవలేక పోవటం రాయలేక పోవటం, బుద్ధి మాంద్యం, శీగ్ర స్కలనం, అంగస్తంభన, కోరికలు లేకపోవటం లాంటి సెక్స్ సమస్యలకు పరిష్కారం చూపెడతారన్నారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓపెన్ యూనివర్సిటీ

పరీక్ష ఫీజు చెల్లించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో 2018-2023 మధ్యలో డిగ్రీలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు మే 6లోగా సెమిస్టర్-1 పరీక్ష ఫీజు చెల్లించాలని కోఆర్డినేటర్ తూడూరి దత్తాత్రేయ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ. 500 అపరాధ రుసుముతో మే 14 వరకు, రూ. వెయ్యి అపరాద రుసుముతో మే 22 వరకు చెల్లించవచ్చని తెలిపారు. సైన్స్ విద్యార్థులు ప్రాక్టికల్ ఫీస్ అదనంగా చెల్లించాలని పేర్కొన్నారు.

అక్రమ వసూళ్లలో మంత్రి సీతక్క వాటా ఎంత..?

- మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బహిరంగ లేఖ



విలేకరుల సమావేశంలో బహిరంగ లేఖను చూపిస్తున్న ఎమ్మెల్యే హరిష్ బాబు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

లోక్‌సభ ఎన్నికల ఫండ్ పేరుతో సిర్పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు కోనేరు కోనప్ప, రావి శ్రీనివాస్ అక్రమంగా భారీ వసూళ్లకు పాల్పడుతున్నారని, ఈ వసూళ్లలో మంత్రి సీతక్క వాటా ఎంతో..? చెప్పాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ప్రశ్నించారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి సీతక్కకు అక్రమ వసూళ్లపై బహిరంగ లేఖ రాశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుల వద్ద మంత్రి పేరు చెప్పి రూ.లక్షలు అక్రమ వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ స్త్రీ వైద్య నిపుణురాలిని బెదిరించి రూ.10 లక్షలు డిమాండ్ చేశారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల ఫండ్ పేరిట మంత్రి సీతక్కకు వాటా ఇవ్వాల్సి ఉంటుందని చెబుతూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న కాంగ్రెస్ నాయకులు కోనేరు కోనప్ప, రావి శ్రీనివాస్‌లపై సమగ్ర విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. కోనేరు కోనప్ప తన అన్నదాన సత్రాన్ని పున:ప్రారంభించాలని కాబట్టి నిధుల సేకరణ కోసం రైస్ మిల్లర్లపై ఒత్తిడి తీసుకు వస్తున్నారన్నారు. వివిధ అంశాలలో మంత్రి సీతక్క పేరును వాడుకుంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఈ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిర్పూర్ నియోజకవర్గంలో రాజ్యాంగేతర శక్తులుగా మారిన కాంగ్రెస్ నాయకులు అటు ప్రజల వద్ద దోపిడీ చేస్తూనే ఇటు తమ అనుచరులకు కాంట్రాక్టులు ఇవ్వాలని మంత్రిపై ఒత్తిడి తీసుకు వస్తున్నారని ఆరోపించారు. ఇది అందరూ ఖండించాల్సిన విషయమని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఓబీసీ మోర్చ నాయకులు గోలెం వెంకటేష్, సిర్పూర్ అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్ర చారి, జిల్లా కోశాధికారి అరుణ్ లోయ, పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, జిల్లా దళిత మోర్చ నాయకులు ఈర్ల విశ్వేశ్వర్, కొప్పుల శంకర్, సత్పుతే తుకారాం, పవన్ పురోహిత్, మామిడి బాలాజీ, నగపురే మోహన్, కత్తేర్ల భీమెష్, దుర్గం జనార్ధన్, సంతోష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటించి..

బాధితులను పరామర్శించి..

- ఆదుకుంటామని హామీ ఇచ్చిన ఎంపీపీ, నాయకులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని వేరువేరు గ్రామాల్లో జరిగిన ఈదురు గాలుల నష్టంతో పాటు ఇల్లు కాలిపోయి నష్టపోయిన బాదితులను వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పరామర్శించి పరిహారం కోసం డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం ఒక్కసారిగా వీచిన ఈదురు గాలులతో మండలంలోని బూరుగుడ గ్రామంలో ఎంపీపీ మల్లికార్జున్ పర్యటించారు. ఇండ్లపై రేకులు పోవడంతో పాటు జరిగిన నష్టానికి పరిహారం చెల్లించి బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. ఈదురు గాలులతో 15 కుటుంబాలు నష్టపోయాయన్నారు. వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు విశాల్, గణేష్, పాల్గొన్నారు.

కౌటగూడలో ఎమ్మార్పీఎస్ నాయకుడి పరామర్శ

కౌటగూడా గ్రామంలో గెడం లక్ష్మణ్ ఇల్లు కాలిపోయి ఆస్తి నష్టం జరగగా ఆయన కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ పరామర్శించారు. నగదు బంగారం ఇతర వస్తువులు కాలిపోయి దాదాపు రూ.15 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని ప్రభుత్వం పరిహారం అందించి బాధితుడిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో స్వేచ్ఛ, క్రమశిక్షణ లేదు

- జడ్పీటీసీ నాగేశ్వరరావ్



విలేకరుల సమావేశంలో సిర్పూర్ ఎమ్మెల్యే హరిష్‌బాబు, జడ్పీటీసీ నాగేశ్వర్‌రావ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్


బీఆర్ఎస్‌లో నాయకులకు స్వేచ్ఛ, పార్టీలో క్రమశిక్షణ లేదని జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు ఆరోపించారు. బీజేపీలో చేరిన తర్వాత జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్, కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో ఏకఛత్రాధిపత్యం కొనసాగుతుందని, ఆ పార్టీలో నాయకులకు స్వేచ్ఛ లేదన్నారు. పార్టీ కార్యక్రమాల్లో ఎక్కడ కూడా క్రమశిక్షణ కనిపించదని గతంలో పని చేసిన టీడీపీలో ప్రస్తుతం చేరిక సందర్భంగా బీజేపీ, రాష్ట్ర కార్యాలయంలో ఎంతో మర్యాద క్రమశిక్షణ కనిపించిందన్నారు. మర్యాద లేనిచోట ఉండలేకనే బయటకు వచ్చినట్లు తెలిపారు. బీజేపీలో మంత్రిత్వ శాఖలకు పూర్తి స్వేచ్ఛ ఉంటుందని అది బీఆర్ఎస్‌లో పది సంవత్సరాల్లో ఎక్కడ కూడా కనిపించలేదన్నారు. తాను పెద్ద లీడర్ అని తనను ఎలాగైనా ఓడించాలని సంకల్పంతో 2015 స్థానిక సంస్థల ఎన్నికల్లో వాంకిడికి పంపించినట్టు ఆరోపించారు. ప్రజలతో కొనసాగించే సత్సంబంధాలతో తాను ఇప్పటివరకు గెలిచినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో బీజేపీ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ప్రపంచంలో భారత దేశానికి మోడీ ఒక గుర్తింపు తీసుకువచ్చారని కితాబునిచ్చారు. ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో నియోజకవర్గం నుండి 50 వేల మెజార్టీ ఇవ్వనున్నట్లు స్థానిక సంస్థల్లో పెద్ద ఎత్తున సత్తా చాటే దిశగా ముందుకు సాగుతామన్నారు. జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గత 40 సంవత్సరాల నుండి ప్రజాభిమానాన్ని చురగొన్న నేత తమ పార్టీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే హరీష్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి శత్రువులు ఎవరూ లేరని ఎన్నికల్లో అమలు సాధ్యం కానీ హామీలు ఇచ్చి వారికి వారే శత్రువులయ్యారన్నారు. గడిచిన నాలుగు నెలల్లో ఇది కనిపించిందని రైతు భరోసా, రుణమాఫీ, ప్రతి మహిళకు రూ.2500 భృతి, రూ.500కి గ్యాస్ సిలిండర్, ఉచిత కరెంటు ఇలా దేనిని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేక పోయిందన్నారు. రుణమాఫీ విషయంలో రేవంత్ రెడ్డి ఎప్పటికప్పుడు మాట మార్చడమే వారి డొల్లతనాన్ని తెలియజేస్తుందని ఆరోపించారు. అటు దేశంలో ఇటు రాష్ట్రంలో ప్రస్తుతం బీజేపీకి అనుకూలంగా ఉందని దీనిని వినియోగించుకొని అధిక సీట్లు సాధించి అవినీతి రహిత పాలన ప్రజలకు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. అంతకు ముందు నాయకులను సన్మానించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు ఖాండ్రే విశాల్, కొట్నాక విజయ్, చెర్ల మురళి, గుల్బం చక్రపాణి, కిరణ్, సొల్లు లక్ష్మి, అంజనేయులు గౌడ్, కృష్ణకుమారి, ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి

ఉత్సవాల కరపత్రం విడుదల

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 23న జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో నిర్వహించనున్న హనుమాన్ జయంతి ఉత్సవాల కరపత్రాన్ని ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే హరీష్ బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ప్రత్యేక పూజలు చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు వివరించారు. నాయకులు, ప్రజలు, భక్తులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు, సభ్యులు పిన్న వివేక్, గుండా వెంకన్న, నాయకులు కొట్నాక విజయ్, విశాల్, గణేష్, చక్రపాణి పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శుక్రవారం | ఏప్రిల్ 19, 2024 | www.navatelangana.com

గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూస్తాం

నవతెలంగాణ-జన్నారం



వేసవి దృశ్య గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చూస్తామని ఎంపీడీఓ శశికళ అన్నారు. గురువారం మండలంలోని కొత్తపేట గ్రామంలో ఎంపీడీఓ పర్యటించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమె కొత్తపేట గ్రామంలో పర్యటించి నీటి వనరులను పరిశీలించారు. గ్రామంలో ఉన్న బోర్లను తనిఖీ చేసి అవి పని చేస్తున్నాయో, లేదో చూశారు. అలాగే గ్రామంలో ఉన్న ప్రభుత్వ నర్సరీని కూడా ఆమె సందర్శించారు. గ్రామంలో నీటి ఎద్దడి ఏర్పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వేసవిలో ఏ గ్రామంలో కూడా తాగు నీటి సమస్య రాకుండా చూడాలని ఆదేశించారు. సమస్య ఉన్న గ్రామాలపై ముందస్తుగానే వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏపీఓ రవీందర్, పంచాయతీ కార్యదర్శి, భీమ్‌రావు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-జైపూర్



మండలంలోని రామారావుపేట్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకట స్వామి సమక్షంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ తంగళ్లపల్లి వెంకటేశంతో పాటు వార్డు సభ్యులు గోలి వెంకటేష్, లోడింగ్ అన్‌లోడింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు బొద్దున రాజేశం, పద్మశాలి సంఘం నాయకులు మెరుగు సమ్మయ్య తదితరులు ఎమ్మెల్యే చేతుల మీదుగా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ గెలుపుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు ఫయాజోద్దీన్, మాజీ సర్పంచ్ నామాల సత్యవతి తిరుపతి, మాజీ ఎంపీటీసీ ముదాం రమేష్, పార్టీ నాయకులు నాగరాజు, మాజీ ఉప సర్పంచ్ గుండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రయాణికునికి సాయం చేసిన పోలీసులు



నవతెలంగాణ-జన్నారం

హైదరాబాద్ వెళ్లే బస్సు మిస్ అయిన ప్రయాణికునికి జన్నారం పోలీసులు సహకరించి అదే బస్సులో ప్రయాణించేలా సహకరించారు. ఉట్నూర్‌కు చెందిన పృథ్వీరాజ్ బుధవారం రాత్రి హైదరాబాద్ వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కారు. పృథ్వీరాజ్ జన్నారం బస్టాండులో దిగి కాలకృత్యాలు తీర్చుకుని వచ్చేలోపు బస్సు వెళ్ళిపోయింది. దీంతో ఆయన బ్లూ కోట్ పోలీసులకు సమాచారం అందించగా వెంటనే స్పందించిన బ్లూ కోట్ పోలీసులు శ్రీనివాస్, నీలయ్య ఆర్టీసీ బస్సును వెంబడించి చింతగూడ వద్ద బస్సును ఆపి అదే బస్సులో ఆయనను పంపించారు. ఆ సమయంలో బాధితుడు పృథ్వీరాజ్ డబ్బులు, బ్యాగు, సర్టిఫికెట్లు బస్సులోనే ఉండిపోయాయి. ఈ సందర్భంగా బాధితుడు పృథ్వీరాజ్ బ్లూ కోట్ పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. విషయం తెలుసుకున్న మండల వాసులు కూడా పోలీసులను అభినందిస్తున్నారు.

ప్రతి జీపీలో ఎన్నికల నోటిఫికేషన్ అంటించాలి

- చెన్నూర్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ చంద్రకళ



నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలోని ప్రతి గ్రామ పంచాయతీ కార్యలయంలో ఎన్నికల నోటిఫికేషన్ అంటించాలని చెన్నూర్ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ చంద్రకళ సూచించారు. గురువారం భీమారం మండల కేంద్రానికి వచ్చిన ఆమె స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. తాగు నీరు, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటింగ్ రోజు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో అవసరమైన చోట షామియాలను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ రాధా రాథోడ్, ఎంపీఓ సతీష్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జన్నారం : మండలంలోని గ్రామాల పంచాయతీ కార్యాలయాల బోర్డులకు గురువారం లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ ప్రతులను అంటించారు. ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఎంపీ ఎన్నికల నోటిఫికేషన్ ప్రతులను మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యాలయాల బోర్డులకు అంటించారు. వాటిలో నామినేషన్ల దాఖలు, ఉపసంహరణ, ఎన్నికల తేదీ లాంటి వివరాలు ఉంటాయని ఎంపీఓ రమేష్ తెలిపారు.

మండలంలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం



నవతెలంగాణ-జన్నారం

ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణకు మద్దతుగా గురువారం మండలంలోని సింగరాయపేట, రాంపూర్, రోటిగూడ గ్రామలలో మాజీ జడ్పీటీసీ పంకజ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ స్కీమ్లను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలన్నారు. ఆత్రం సుగుణను ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ హడాయి లలిత, కాంగ్రెస్ నాయకులు కాలవ సుగుణ, హనుమంత రావు, భాగ్యరావు, డాక్టర్ సురక్షణ్ పాల్గొన్నారు.

21న ఉమ్మడి జిల్లా బాలుర సీనియర్స్ ఫుట్‌బాల్ ఎంపిక

నవతెలంగాణ-మందమర్రి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలుర సీనియర్స్ ఫుట్‌బాల్ సెలక్షన్స్ ట్రయల్స్‌ను ఈనెల 21 మధ్యాహ్నం 2గంటలకు సింగరేణి హై స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ సెక్రెటరీ పినాటి రఘునాథ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెలక్షన్స్‌కు వచ్చే క్రీడాకారులు ఆధార్ కార్డు, మూడు పాస్ ఫొటోలు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌లను తీసుకురావాలని తెలిపారు. పూర్తి వివరాలకు మందమర్రి ఫుట్‌బాల్ ఆర్గనైజేషన్ కమిటీ గాలిపెల్లి సురేందర్ 8519878452, కరుణాకర్ 9849444744 సంప్రదించాలన్నారు.

గర్భిణులకు బేడ్‌షీట్స్ ఇస్తలేరు



తమ వెంట తెచ్చుకున్న బేడ్‌షీట్స్ పరుచుకొని ఉన్న గర్భిణీ

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని మాతా శిశు హాస్పిటల్‌కు వచ్చే గర్భిణులకు సిబ్బంది బెడ్ షీట్స్ అందివ్వడం లేదు. డెలివరీ అయినప్పటి నుండి డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లే అంత వరకు గర్భిణీలు తమతో తెచ్చుకున్న చెద్దర్‌లనే బెడ్ షీట్స్‌లాగా వాడుకుంటున్నారు. మంచిర్యాల మాత శిశు హాస్పిటల్‌లో డెలివరీ, పోస్ట్ మెట్రిక్ వార్డ్, లేబర్ రూమ్‌లు కలిపి మొత్తం 132 బెడ్లు ఉన్నప్పటికీ ఏ ఒక్క బెడ్‌పై హాస్పిటల్ నుండి ఇచ్చే బేడ్‌షీట్స్ కనిపించడం లేదు. ప్రతి రోజు వార్డ్ శుభ్రం చేసే క్రమంలో సిబ్బంది బెడ్స్ పైన ఉన్న బెడ్ షీట్స్‌ను కూడా మార్చాల్సి ఉంటుంది. కానీ హాస్పిటల్‌కు వచ్చే గర్భిణులు వారి వెంట తెచ్చుకున్న చెద్దర్‌లను బెడ్ షీట్స్ లాగ బెడ్‌పై పర్చుకుంటున్నారు. డెలివరీ అనంతరం గర్భిణులు బెడ్‌పై పడుకో పెట్టె సమయంలో సిబ్బందే వారి వద్ద ఉన్న తెల్లని రంగు కలిగిన బెడ్ షీట్‌ను బెడ్‌పై పరచాల్సి ఉంటుంది కానీ కుటుంబ సభ్యులు బేడ్‌షీట్స్ కావాలని అడిగిన కూడా సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నట్లు వార్డులోని రోగులు ఆరోపించారు. గత సంవత్సరం మార్చి, డిసెంబర్ నెలలో కలిపి మంచిర్యాలలోని మాత శిశు హాస్పిటల్‌కు మొత్తం 400 బేడ్‌షీట్స్ అందించిన అధికారుల లెక్కల్లో తేలింది. అందుబాటులో అన్ని బేడ్‌షీట్స్ ఉండగా బాలింతలు పడుకునే బెడ్స్‌పై సిబ్బంది బేడ్‌షీట్స్ అందించకుండ ఎందుకు ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారనేది ప్రశ్నార్థకం సిబ్బంది గర్భిణీ స్త్రీలకు బేడ్‌షీట్స్ అందించక పోవడంపై మంచిర్యాల ప్రధాన హాస్పిటల్ సూపరింటెండెంట్ హరీష్ చంద్రరెడ్డిని వివరణ కోరగ గతంలో పని చేసిన దోబీ 370జిఓలో ఆసిఫాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యారని, ప్రతి రోజు వాటిని తీసుకెళ్లి శుభ్రం చేసి తీసుకొని వచ్చేందుకు దోబీ లేకపోవడంతో బెడ్ షీట్స్‌ను వార్డులకు అందించలేక పోతున్నామని తెలిపారు. త్వరలోనే అవుట్ సోర్సింగ్ విధానం లేదా పేర్మినెంట్ గానో దోబీని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.

ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఎస్సీకేఎస్ (సీఐటీయూ)రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎస్సీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఉపరితల గని కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, బ్లాస్టింగ్ కార్మికులను యథావిధిగా కొనసాగించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ సంఘం (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ అన్నారు. ఎస్ఆర్పీ ఓసీపీలోని ఓబిలో పనిచేస్తున్న కాంట్రాక్టు బ్లాస్టింగ్, వోల్వో డ్రైవర్లు, డంపర్ ఆపరేటర్ల సమస్యలను సీఆర్ఆర్ యజమాన్యం పరిష్కరించే విధంగా యాజమాన్యం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓబీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు బతుకు తెరువును ఇచ్చే విలువైన భూములు, ఇండ్ల స్థలాలను ఇచ్చిన భూ నిర్వాసితులే ఉన్నారని, వారికి సింగరేణి యాజమాన్యం పని కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. అయితే బ్లాస్టింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న కార్మికులను తొలగించే పని సీఆర్ఆర్ యజమాన్యం చేయడం దుర్మార్గమైన పని అని మండిపడ్డారు. మొత్తం 28 మంది బ్లాస్టింగ్ కార్మికులకు గాను 12 మందిని తొలగించాలని సీఆర్ఆర్ యజమాన్యం ప్రయత్నిస్తోందని, వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని బ్లాస్టింగ్ కార్మికులందరినీ యథావిధిగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఐదు రోజుల నుండి వారి బోనస్ సమస్యను పరిష్కరించాలని విధులు బహిష్కరించి వారి డిమాండ్లను తెలియజేసిన యాజమాన్యం స్పందించకపోవడం సరైన పద్ధతి కాదని, సంవత్సరానికి ఒకసారి ఇవ్వాల్సిన బోనస్‌ను 18 నెలలు గడిచిన పూర్తిస్థాయిలో చెల్లించకుండా సీఆర్ఆర్ యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. సింగరేణి యాజమాన్యం చెల్లిస్తున్న 8.33శాతం ప్రకారంగా కార్మికులందరికీ పూర్తిస్థాయిలో బోనస్ చెల్లించి, పనులు కొనసాగించే విధంగా సీఆర్ఆర్, సింగరేణి యాజమాన్యలు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీ బ్లాస్టింగ్ కార్మికులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ భర్తపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



పట్టణంలోని స్థానిక 22వ వార్డు కౌన్సిలర్ ఎర్రబెల్లి ప్రేమలత భర్త రాజేష్ జర్నలిస్టులపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని విలేకరి సదానందం కోరారు. గురువారం పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ రాజశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దండు సదానందం మాట్లాడుతూ ఇటీవల స్థానిక భగత్ సింగ్ నగర్ ఏరియా సింగరేణి క్వార్టర్‌ల మధ్య ఉన్న సింగరేణి స్థలాన్ని కబ్జా చేసి, పుర పాలక చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ విద్యా సాగర్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులతో కలిసి భూమి పూజ చేశాడు. భూ కబ్జాపై పత్రికలో వార్త కథనాన్ని రాసి గ్రూప్‌లలో పంపించానని తెలిపారు. దీంతో మందమర్రి ఏరియా సింగరేణి అధికారులు స్పందించి బుధవారం ఆ స్థలాన్ని పరిశీలించి సింగరేణి భూమి కబ్జాకు గురైందని నిర్ధారించారు. సింగరేణి స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుంటామని అధికారులు హెచ్చరించారు. సింగరేణి అధికారులు స్పందించిన వార్త కథనాన్ని రాసి గురువారం వివిధ వాట్సాప్ గ్రూప్‌లలో సెండ్ చేయగా, భూ కబ్జా దారుడు రాజేష్ వాట్సాప్ వేదికగా జర్నలిస్టుల అందరిని ఉద్దేశిస్తూ అనుచిత వ్యాఖ్యల పోస్ట్ చేశాడన్నారు. దీంతో జర్నలిస్టులు కలిసి అతనిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

- సీఎం రేవంత్ రెడ్డికి పోస్టు కార్డులు పంపిన కిష్టంపేట్ రైతులు



పోస్టుకార్డులు ప్రదర్శిస్తున్న రైతులు

నవతెలంగాణ-జైపూర్

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రకటించిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంతర్ రెడ్డికి పోస్టు కార్డులు పంపిస్తూ హామీలను ప్రస్తవించారు. వరి ధాన్యనికి రూ. 500 బోనస్, రైతు భరోసా కింద రూ. 10 వేలకు బదులుగా రూ. 15 వేలు, రైతు కూలీలకు ప్రకటించిన రూ. 12 వేల చెల్లింపు, రూ. 2 లక్షల రైతు రుణ మాఫీ, రైతు భీమా, వర్షాబావ పరిస్థితులతో ఎండి పోయిన పంటలకు రూ. 25 వేల చొప్పున నష్ట పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్న ఎక్కడ కూడా హామీల అమలు ప్రస్తవ లేదని రైతులు మండిపడ్డారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేని పక్షంలో పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రైతులు చేపట్టిన పోస్టు కార్డు ఉద్యమానికి మండల బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు.

కుట్టు శిక్షణ కేంద్రాలను సందర్శించిన డీఈఓ

నవతెలంగాణ-మందమర్రి



కుట్టు శిక్షణలో నైపుణ్యం సాధించి ఆర్థిక స్వావలంబన సాధించాలని డీఈఓ యాదయ్య సూచించారు. సుభాష్ నగర్‌లో వయోజన విద్యాశాఖ, సఖి, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్ కుట్టించే బాధ్యత కూడా అప్పగిస్తామని వారికి హామీ ఇచ్చారు. మహిళాలు వృత్తి నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుంటు కుటుంబానికి బాసటగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్ పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభం

- కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల నుండి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రారంభించడం జరిగిందని కలెక్టర్ బదావత్ సంతోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన గెజిట్ ప్రకారం రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలకు జరుగనున్న ఎన్నికలలో భాగంగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజవర్గ పరిధిలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల శాసనసభ నియోజకవర్గాలలో ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేశామన్నారు. ఈ క్రమంలో 25 వరకు (ప్రభుత్వ సెలవు రోజులు మినహాయించి) ప్రతి రోజు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం పెద్దపల్లిలోని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్, సహాయ రిటర్నింగ్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారికి అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించాలన్నారు. నామినేషన్ ఫారాలను నిర్దేశిత పని వేళలో పొందవచ్చని తెలిపారు. ఈ నెల 26న ఉదయం 11 గంటల నుండి నామినేషన్ల పరిశీలన, ఉపసంహరించుకోవడానికి నోటీసును అభ్యర్థి స్వయంగా లేదా ప్రతిపాదకులు, ఎన్నికల ఏజెంట్‌తో రాత పూర్వకంగా ఈ నెల 29 మధ్యాహ్నం 3 గంటలలోగా అందజేయవచ్చని తెలిపారు. తుది జాబితా అనంతరం మే 13న పోలింగ్ ఉంటుందన్నారు. ఉదయం 7 నుండి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ ఉటుందన్నారు. చెన్నూర్‌లో 227, బెల్లంపల్లిలో 227, మంచిర్యాలలో 287 మొత్తంగా 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, గర్భిణుల కోసం ర్యాంపు, వీల్‌చైర్స్ సదుపాయం కల్పించామని తెలిపారు. పోలింగ్ రోజున ప్రభుత్వంచే జారీ చేసిన గుర్తింపు కార్డులలో ఏదైనా ఉపయోగించుకొని ఓటు వేయవచ్చని తెలిపారు.

ఘనంగా సీతారాముల కళోత్సవాలు



నవతెలంగాణ-మందమర్రి

శ్రీ రామ నవమి వేడుకలను పురస్కరించుకుని భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ ప్రభుత్వం సహకారంతో క్రేజీ స్టార్స్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి యాపల్‌లోని శ్రీ కోదండ రామాలయం వద్ద సీతారాముల కళోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సంగార్తి సంతోష్ జ్యోతి ప్రజ్వలన చేయగా రంగస్థల పూజను నృత్య కళా సమాఖ్య మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రాకం సంతోష్ నిర్వహించారు. శ్రీ సాయి నాట్య కళా నిలయం నాట్య గురువు అశ్విని బృందం, నటరాజ నృత్య కళా నిలయం నాట్య గురువు అర్చన బృందంలోని పలువురు చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆహూతులను అకట్టుకున్నాయి. కోల కృష్ణ ఆర్కెస్ట్రా బృందం పాడిన భక్తి పాటలు, సీనియర్ కళాకారుడు సాదనవేణి ప్రభాకర్, సింగర్ పద్మ పాడిన జానపద గీతాలు, యూట్యూబ్ ఫోక్ స్టార్ తస్లీమా బృందం, అసం కళ్యాణ్ బృందం, ఏబీసీడీ ఎనీబడి కెన్ డాన్స్ బృందం ప్రదర్శించిన జానపద నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ ధూమ్ ధాం వ్యవస్థాపకుడు జాతీయ స్థాయి జానపద కళాకారుడు అంతడుపుల నాగరాజు పాల్గొని ప్రసంగించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాకారులకు వేదికను కల్పించిన ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. కళాకారులకు జ్ఞాపికలను అందజేసారు. ఈ కార్యక్రమంలో క్రేజీ స్టార్స్ డాన్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేష్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కన్వీనర్ నెరువట్ల రాజలింగు, ఆలయ కమిటీ సభ్యులు కళాకారులు ఉప్పులేటి రాజమౌళి, వెల్తురి పాషం పాల్గొన్నారు.

భక్తాంజనేయాలయంలో శాంతిహోమం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ కాలనీలోని శ్రీ భక్తాంజనేయాలయంలో గురువారం శ్రీరామ నవమి ముగింపు వేడుకల్లో భాగంగా ఆలయ చైర్మెన్ మల్లెత్తుల రాజేంద్రపాణి, అధ్యక్షుడు తోట సురేష్, ప్రధాన కార్యదర్శి మల్లెత్తుల శ్రీనివాస్ ఆద్వర్యంలో శాంతి హోమం, శ్రీరామ పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. సీతారాములకు, ఆంజనేయస్వామి పండితులు కొమ్మెర సత్యనారాయణ, విజయ్ శర్మలు అభిషేకాలు నిర్విహించారు. ఆలయంలో ప్రభాత సేవ, పుష్పార్చణ చేశారు. ఆలయంలో లోక కళ్యాణార్థం హోమం నిర్వహించగా తోడె సతీశ్వరెడ్డి, సంజీవ్ దంపతులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు బొద్దున రమేశ్, రేగళ్ల ఉపెందర్, బండి తిరుపతి, సంపత్, లింగయ్య, రవి పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

నవతెలంగాణ-జన్నారం

ఎంపీ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేష్ గెలుపు ఖాయమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరులతో వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అభివృద్ధి చేస్తుందన్నారు. మోడీని ప్రధాని చేయడానికి ప్రతి ఒక్క కార్యకర్త కంకణ బద్దులై బీజేపీకి ఓటు వేయించే విధంగా, పల్లెపల్లె, గ్రామగ్రామాన తిరుగుతూ ఓట్లు వేయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్, జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, మండల మాజీ అధ్యక్షులు గోలి చందు, నాయకులు మడుగు ప్రవీణ్, కాసెట్టి లక్ష్మణ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | ఏప్రిల్ 19, 2024 | www.navatelangana.com

అక్రమ మద్యం సీసాల పట్టివేత

నవతెలంగాణ-కుభీర్



మండలంలోని పార్డి(బి)గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న బెల్టు షాపుల్లో తనిఖీలు నిర్వహించి, మద్యం సీసాలు పట్టుకున్నారు. ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గురువారం పోలీసులు తనిఖీల చేపట్టారు. పార్డి(బి) గ్రామానికి చెందిన కోడిప్యాక్ సాయినాథ్ నుంచి 14.94లీటర్ల మద్యం సీసాలు లభించినట్టు తెలిపారు. దీని విలువ సుమారు రూ.5,976 ఉంటుందని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి మద్యం, డబ్బులు, సరఫరా చేసినట్లయితే వారిపై కఠిన చర్యలు కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఆయన వెంట ఏఎస్సై శివయ్య, సిబ్బంది ఉన్నారు.

లాభాల బాటలో తీసుకురావడానికి ప్రతిజ్ఞ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



టీఎస్ ఆర్టీసీని లాభాల బాటలో తీసుకురావడాని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఉగాది-2024 నుంచి ఉగాది-2025 వరకు "లక్ష లక్ష్యం" గా నామకరణం చేశారు. ఇందులో భాగంగా గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. డిపోలో ప్రతి రోజుకు రూ.ఒక లక్ష ఆదాయం పెంచడానికి డిపో మేనేజర్ కల్పన, డ్రైవర్, కండక్టర్‌లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీకర్ ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణను పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-నిర్మల్

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అన్నారు. దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపులు, వీల్‌చైర్ ఏర్పాటు చేయాలనీ సూచించారు. పోలింగ్ సిబ్బంది రవాణాకు రూట్‌ల వారీగా బస్సులను ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌పోర్ట్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణలు పూర్తి చేయాలనీ, శిక్షణలకు హాజరుకాని సిబ్బందికి నోటీసులు జారీచేయాలని, ఎన్నికల వ్యయాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వంద శాతం ఓటింగ్ నమోదు దిశగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో విస్తృతంగా స్వీప్ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఫ్లెక్సీలు, సెల్ఫీ పాయింట్, కళాజాత 2కే రన్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ పార్టీల ప్రకటనలకు ఎంసీఎంసీ ద్వారా అనుమతులు జారీ చేయాలనీ సూచించారు. వందశాతం వెబ్ కాస్టింగ్ కి చర్యలు తీసుకోవాలని అన్నారు. 1950 కాల్ సెంటర్, సీవిజిల్‌ను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, నోడల్ అధికారులు భుజంగరావు, గోవింద్, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, విజయలక్ష్మి సందీప్, విష్ణువర్ధన్, ఈడీఎం నదీమ్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలి

- ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

నవతెలంగాణ-నస్పూర్

రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద ఫాసిస్ట్ బీజేపీని ఓడించాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. గురువారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేండ్లలో దేశానికి బీజేపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని, కార్పొరేట్ సంస్థలకు సేవకుడిగా పని చేశారని ఆరోపించారు. 1973 సంవత్సరం నుండి ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కూడా ప్రయివేట్ పరం చేస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వంలో 267 ప్రభుత్వరంగ సంస్థలను లేకుండా చేసిందని, దీనివల్ల దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుందన్నారు. ప్రజల్లో ఉద్యోగ భద్రత, ఉపాధి అవకాశాలు లేకుండా పోతాయని, ఒక్క కార్పొరేట్ సంస్థల ఆస్తులు మాత్రమే పెరుగుతాయని పేర్కొన్నారు. అలాగే 16 రాష్ట్రాల్లో ఉన్న సహజ సంపద అరుదైన 26 రకాల ఖనిజ సంపద ఉన్నాయని దానిని కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి అటవీ శాఖ చట్టాలను సైతం మారుస్తున్నారన్నారు. బ్యాంకుల్లో దాదాపు రూ. 20 లక్షల కోట్లను అప్పు చేసిన కార్పొరేటర్ల అప్పులను సైతం మాఫీ చేసిందని, మీడియా, న్యాయవ్యవస్థ, సిబిఐ, ఈడి సంస్థలని తన గుప్పిట్లో పెట్టుకుని నియంతల వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి అన్యాయంగా హింసిస్తున్నారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ అడుగుజాడల్లో నడుస్తూ మతం పేరుతో ప్రజల్ని, కార్మిక వర్గాన్ని విభజించి పాలిస్తుందని ఆరోపించారు. ప్రజల పక్షాన పోరాటం చేసేవారిని మతోన్మాదులు, మావోయిస్టులంటూ అణిచి వేస్తున్నారన్నారు. అలాగే మూడు లక్షల అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతనాలు కూడా చెల్లించడం లేదన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేసిందని, దాని ఫలితంగానే అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరజయం పాలయిందని, దాని ఫలితాల్ని అనుభవిస్తున్నారన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, రాష్ట్రంలో కొత్త ప్రాజెక్టులు తీసుకురావాలని, రూ.26000 కనీస వేతనం చెల్లించాలని, వీటన్నిటినీ పార్లమెంట్ ఎన్నికల తర్వాత అమలు చేయాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకన్న, రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం, రాష్ట్ర నాయకురాలు శోభ, డివిజన్ ప్రధాన కార్యదర్శి శంకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, టీజీఎల్‌బీకెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



నవతెలంగాణ-సారంగాపూర్

పరి శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, రోడ్లు పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం సారంగాపూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో అయన పర్యటించారు. చించోలి(బి) గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, నర్సరీని అయన సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాల్లోని రోడ్లు, ప్రధాన కూడళ్లలో చెత్తను వేయరాదని, తడిచెత్త, పొడి చెత్తలను వేరు వేరుగా సేకరించాలని తెలిపారు. గ్రామంలో దుకాణదారులు, వ్యాపారస్తులు చెత్తను రోడ్ల మీద వేయకుండా నియంత్రించాలని అధికారులకు సూచించారు. చెత్తను రోడ్లమీద వేసే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆలూర్ గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా అయన ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద తూకపు యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్స్, టార్పాలిన్‌లు, ధాన్యపు సంచులు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున రైతులకు ఇబ్బంది కలగకుండా టెంటు, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ప్రతీ ధాన్యపు సంచిలో 40 కిలోల 580 గ్రాముల ధాన్యం నింపాలని అన్నారు. ప్రతీ రైతు విధిగా తమ తమ ఆధార్, బ్యాంకు బుక్, పట్టా పాస్ బుక్ జిరాక్స్ కాపీలు, ఫోన్ నెంబర్‌ను అందజేయాలని సూచించారు. అనంతరం ధని గ్రామంలోని పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా కేటాయించిన నిధులతో పాఠశాలలో మౌలిక సదుపాయాలు, రిపేర్లు పూర్తిచేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా మరుగుదొడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి గోవింద్, డీఈఓ రవీందర్‌రెడ్డి, సారంగాపూర్ తహసీల్దార్ శ్రీదేవి, అధికారులు పాల్గొన్నారు.

పార్లమెంటు ఎన్నికకు నామినేషన్లు వేయొచ్చు



నవతెలంగాణ-నిర్మల్

ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైనందున నేటి నుంచి నామినేషన్లు వేయవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. నామినేషన్ల ప్రక్రియ మొదలైన సందర్భంగా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌లతో కలిసి ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికకు నేటి నుంచి ఏప్రిల్ 25 తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఏప్రిల్ 26న నామినేషన్ల స్క్రూటినీ, ఏప్రిల్ 29 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు ఉంటుందని తెలిపారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ నిర్వహణ జరుగుతుందని అన్నారు. ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయంలోని (కలెక్టర్) ఛాంబర్‌లో నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. సెలవు దినాలు మినహాయించి, మిగతా పని దినాలలో ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలు, అవలంభించాల్సిన విధానాల గురించి కలెక్టర్ వివరించారు. నిర్మల్ జిల్లాలో పురుషులు 3,54,925 మంది, మహిళలు 3,81,667 మంది, ఇతరులు 50 మొత్తం 7,36,642 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. నూతన ఓటరు నమోదు కోసం దాఖలైన దరఖాస్తులను ఈ నెల 25 వరకు పరిశీలించి జాబితాలో అర్హులైన వారి పేర్లను చేర్చడం జరుగుతుందని అన్నారు. పార్లమెంటు సెగ్మెంట్‌లోని నిర్మల్, ముధోల్, ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గల 667 ప్రాంతాలలో మొత్తం 925 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఇప్పటివరకు రూ.1కోటి 90లక్షల 9వేల 610 నగదును సీజ్ చేశామని, దీనికి సంబంధించి 72 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే 298 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని 127 కేసులు నమోదు చేశామని అన్నారు. 289 మంది సమస్యాత్మక వ్యక్తులను బైండోవర్ చేసినట్లు వివరించారు. ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో డీపీఆర్‌ఓ విష్ణువర్ధన్, డీఈఓ రవీందర్‌రెడ్డి, డీఆర్డీఓ విజయలక్ష్మి, ఈడీఎం నదీమ్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాస్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

- ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ



నవతెలంగాణ-తలమడుగు

కాంగ్రెస్ అంటేనే ప్రజల అభివృద్ధి కోసమే పనిచేస్తుందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ తెలిపారు. గురువారం మండలంలోని దేవాపూర్, బరంపూర్ ఝరి, పూనగూడ, కుచులాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ బడుగు బలహీన వర్గాల ప్రజలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసే దిశగా పని చేస్తుందన్నారు. కుల మతాలకు తారతమ్య భేదాలు లేకుండా దేశాభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని అన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గెలిచిన తర్వాత వివిధ సంక్షేమ పథకాలతో పాటు మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రజలు చైతన్యవంతులై నిజాన్ని తెలుసుకొని చేతి గుర్తుకు ఓటు వేసి రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని అన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల పాలకులు నీళ్లు, నిధులు, ఉపాధి, ఉద్యోగ నియామకాలు మరిచి అక్షింతల పేరిట దేశ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. బీజేపీ నాయకులు దేవుళ్ల ఆలయాల పేరిట రాజకీయం చేస్తూ ప్రజలను రెచ్చ గొడుతూ మోసం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా ఉండే విధంగా అభివృద్ధి పనులు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే త్యాగాలకు పుట్టినిల్లు అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకకు కొంగు చాచి మీ అక్కగా, చెల్లెగా ఓట్లు అడుగుతున్నా చెయ్యి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించి, ఆడబిడ్డను దీవించాలని అన్నారు. బరంపూర్, కుచులాపూర్ గ్రామాల్లో వివిధ పార్టీల నుంచి ఎంపీ అభ్యర్థి సుగుణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అడే గజేంధర్, జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బొల్లారం బాబన్న, కాంగ్రెస్ నాయకులు కళ్యాణం రాజేశ్వర్, ప్రకాష్‌రావు, శ్రీకాంత్‌రెడ్డి, వెంకన్న, గోక భూమారెడ్డి, ప్రతాప్, శాస్త్రి, పోశెట్టి, కమలాకర్, రావుల నారాయణ, వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

తాంసి : కొంగు పట్టి అడుగుతున్నా మీ అడబిడ్డని ఆదరించి ఎంపీగా గెలిపించాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ ఓటర్లను కోరారు. గురువారం మండలంలోని పొన్నారి గ్రామంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి సుగుణ మాట్లాడుతూ ఒక ఆడబిడ్డగా మీ ఇంటి ఆడపడుచుగా మీ గ్రామానికి వచ్చానని కొంగుచాపి అడుగుతున్ననని ఎల్లవేళల అందుబాటులో ఉంటానని అన్నారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థిగా ఉన్న గోడం నగేష్ గత ఎన్నో సంవత్సరాలుగా ఎంపీగా, ఎమ్మెల్యేగా, ఉన్న సమయంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి వెడ్మ బొజ్జు, ఆడే గజేందర్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, తలమడుగు జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నారాయణ, సంతోష్, రామన్న యాదవ్, గడుగు గంగన్న, కృష్ణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, లింగారెడ్డి, నరేష్, వివిధ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : మండలంలోని చించుఘాట్, కొత్త చించుఘాట్, జెండగూడ, టేకిడి గూడ, ధర్మగూడ, మాలేబోరిగాంలో మాజీ సర్పంచ్ ఎల్లి బోజారెడ్డి, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు సుధాగోణి సుధాకర్‌గౌడ్ , బండి దేవిదాస్‌లు పర్యటించి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపంచాలని, ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుమ్ర భీమ్‌రావు, పెందూర్ సుంగు, సెడ్మకి రాము పటేల్, నాందేవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై బురద జల్లేందుకే ఆరోపణలు

- తాలుకా ఇన్‌చార్జి రావి శ్రీనివాస్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీపై బురద జల్లేందుకే తమపై సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ తాలుకా ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 33 సంవత్సరాల తన రాజకీయ ప్రస్థానంలో అక్రమంగా దోచుకున్నట్టు నిరూపిస్తే తన ఇంటిని హరీష్ పేరుమీద రాసి ఇస్తానన్నారు. డిపాజిట్లు రాని వాళ్లు సైతం సీఎం, పీఎం స్థాయికి వెళ్లారన్నది తెలుసుకోవాలన్నారు. అక్రమ బియ్యం దందాపై తాము అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు నెరవేర్చే ప్రయత్నం చేయాలని, అసత్యపు ఆరోపణలు చేసిన పాల్వాయి హరీష్ బాబుపై స్థానిక సీఐకి ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. తమపై చేసిన ఆరోపణలను నిర్ధారించని పక్షంలో బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో పరువు నష్టం కేసు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బెజ్జూర్ : లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపొందారన్న విషయం తెలిసి పార్టీని బద్నాం చేయడానికి సిర్పూర్ ఎమ్మెల్యే అసత్య ఆరోపణలు చేస్తున్నారని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాచకొండ శ్రీవర్ధన్, మండల అధ్యక్షుడు బూస శంకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు కాంగ్రెస్ వైపు ఉన్నారని ఈ విషయం తెలిసి ఎమ్మెల్యే కాంగ్రెస్ కార్యకర్తల మానోధైర్యంపై దెబ్బకొట్టాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌పై నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. వెంటనే ఎమ్మెల్యే బహిరంగ క్షమాపన చేప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శంకర్, యువజన విభాగం అధ్యక్షులు అబ్దుల్ హకీం, కో ఆప్షన్ సభ్యులు బషారత్ ఖాన్, ఎంపీటీసీ గురజాల వెంకన్న, నాయకులు సిడా సకారం, తెలంగాణ జావిద్, కొండ్ర నరేందర్ గౌడ్, తంగడపల్లి మహేష్, పుల్లూరి సతీష్, షౌకత్ అలీ ఖాన్, మిర్యాల కృష్ణ, ఏ.లక్ష్మణ్ పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారస్తుల ఇళ్లలో పోలీసుల సోదాలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలో అక్రమంగా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న పలువురు వ్యాపారస్తుల ఇళ్లల్లో గురువారం కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. పోలీసులు మూడు టీంలుగా ఏర్పడి వ్యాపారస్థుల ఇళ్ళ, ఆఫీస్‌లలో సోదాలు చేశారు. జుగర్ కిషోర్ లోయ ఇంట్లో రూ. 28 లక్షలు ఎలాంటి ఆధారం లేని నగదును స్వాధీనం చేసుకున్నారు. సురేందర్ సితాని ఇంట్లో పది ప్రామిసరీ నోట్లు, 4 బాండ్ పేపర్లు, 16 బ్లాంక్ చెక్కులు, రూ. 1,43,250 నగదు లభ్యమయ్యాయి. వీరు అమాయకుల నుంచి అక్రమంగా అధిక వడ్డీలను వసూలు చేస్తున్నారని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టౌన్ సీఐ తుత్తూరు శంకరయ్య తెలిపారు.

బీఆర్ఎస్‌కు మూకుమ్మడి రాజీనామా



నవతెలంగాణ-దిలావర్‌పూర్

బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. గురువారం మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. దీంతో బీఆర్ఎస్‌కు నిర్మల్ నియోజకవర్గంలో మరో గట్టి ఎదురు దెబ్బ తగిలినట్లయింది. నిర్మల్ పట్టణంలోని చాలా మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులంతా కాంగ్రెస్‌లోకి క్యూ కడుతున్న విషయం విధితమే. కానీ ఇప్పుడు మండలాల్లోని నాయకులు కూడా అదే బాటలో నడుస్తున్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్, ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ పాల్దె అక్షర అనిల్ కుమార్, మండల రైతుబంధు కోఆర్డినేటర్ కోడె రాజేశ్వర్, వైస్ ఎంపీపీ బాపురావు, కదిలి దేవస్థాన చైర్మెన్ వెంకట్‌రావు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు స్వామిగౌడ్, కాల్వ నరసింహ దేవాలయ కమిటీ చైర్మెన్ మహేష్, కాల్వ సర్పంచ్ తిరుమల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ అమృత చిన్నరెడ్డి, న్యూలోలం సర్పంచ్ ఒడ్నం సవిత కృష్ణ, దిలావర్‌పూర్ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు ధనే రవి, బుజంగారావు, కదిలి ఉపసర్పంచ్ మారుతి పటేల్, పీఏసీఎస్ డైరెక్టర్ దత్తురాం పటేల్, సాంబాజీ పటేల్, కాల్వ మాజీ సర్పంచ్ నర్సారెడ్డి, ఎ.లక్ష్మణ్ సముందర్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఆత్మ డైరెక్టర్ సప్పాల రవి, మరో 500 మందికిపైగా బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. వీరంతా కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావును కలిశారు. త్వరలోనే వీరంతా కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కూడా త్వరలోనే బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరనున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం.

కన్నుల పండుగగా శ్రీరామ పట్టాభి షేకం



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని జామ్ గ్రామంలోని శ్రీ సీతారామ స్వామి ఆలయంలో గురువారం వేద పండితులు రామకృష్ణ ఆధ్వర్యంలో యజ్ఞం, పాలభిషేకం సాయంత్రం శ్రీ సీతారామ పట్టాభి షేకం నిర్వహించారు. అనంతరం పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో మహా అన్నదానం చేశారు. రాత్రి గ్రామ ప్రధాన విధుల గుండా పల్లకి సేవానిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ స్వాములు గ్రామ వీడీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.